

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 1 గురువారం 2026 | సంపుటి : 18 | సంచిక : 238 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

THURSDAY OCTOBER 1 2026 | VOL:18 | ISSUE: 238 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు

హైదరాబాద్: సెప్టెంబర్ 30 విజయ కెరటం ప్రతినిధి

శాసన మండలి కాంగ్రెస్ అభ్యర్థులు సామ రామ్మోహన్‌రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తమను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించినందుకు



ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సామ రామ్మోహన్‌రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఓటర్ల నమోదు, ఎన్నికల ప్రచారంపై అభ్యర్థులకు సీఎం పలు సూచనలు చేసినట్లు తెలిపారు



మోదీ-ట్రంప్ ఫోన్ కాల్.. వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ

ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి

ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ

సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం

ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్-అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు.ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది.భారత్-అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా

(మిగతా 2వ పేజీలో..)



మీ ఆస్తుల లెక్క తేలుస్తా.. కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్!

హైదరాబాద్, సెప్టెంబర్ 30:

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్ విసిరారు. 'దమ్ముంటే మీ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి' అన్నారు. 'హైటెక్ సిటీ పక్కన స్టార్ హోటళ్లు మీ పేరు మీద లేవని చెప్పగలరా? ఉన్నాయని నేను నిరూపిస్తా.. లేకుంటే పేరు మార్చుకుంటా' అని సీఎం రేవంత్ శపథం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబానికి చెందిన మొత్తం ఆస్తుల వివరాలపై ధైర్యముంటే తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన వ్యక్తుల పేరిట ఉన్న వేల కోట్ల రూపాయల ఆస్తులు, భూములు కేవలం ఆరు నెలల వ్యవధిలోనే కేసీఆర్ కుటుంబీకుల పేరిట ఎలా బదిలీ అయ్యాయో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.కేసీఆర్ కుటుంబానికి అమెరికా, సింగపూర్ వంటి దేశాల్లో భారీగా పెట్టుబడులు ఉన్నాయని ఆరోపించారు. దుబాయ్ పాస్‌పోర్ట్ బ్రోకర్ కొడుక్కి ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.



పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు: కేటీఆర్

తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్

నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న

తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా



పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే

(మిగతా 2వ పేజీలో..)

యూపీ పోలీసు విభాగాన్ని రద్దు చేసి.. అన్ని కేసులు సీబీఐకి అప్పగిస్తాం: సుప్రీంకోర్టు ఆగ్రహం

యూపీ పోలీసుల దర్యాప్తు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

నిందితుడు దొరికినా గుర్తుతెలియని వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదుపై ప్రశ్నలు

సంబంధిత అధికారి వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం

ఉత్తరప్రదేశ్ పోలీసుల దర్యాప్తు తీరుపై




కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ... మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి

కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు

సీఎం రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ

నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య



గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం

వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్

(మిగతా 2వ పేజీలో..)

ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం.. దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు

ఢిల్లీలో ఇండియా కూటమి కీలక సమావేశం

సీఈసీ రాజీనామా చేయాలని నేతల డిమాండ్

అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్తంగా 'సేవ్ డెమోక్రసీ' మార్చ్‌లకు పిలుపు

కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరును నిరసిస్తూ 'ఇండియా' విపక్ష కూటమి దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని కూటమి డిమాండ్ చేసింది. ఢిల్లీలో ఈరోజు జరిగిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, ఒమర్ అబ్దుల్లా, తేజస్వి యాదవ్ సహా 19 పార్టీల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందని నేతలు ఆరోపించారు. ఈ సందర్భంగా



కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ.. "ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అక్టోబర్ 2 నుంచి 8 వరకు జిల్లా స్థాయిలో 'సేవ్ డెమోక్రసీ'

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరళం
తెలుగు దినపత్రిక

02 జనరల్ న్యూస్

సం పా ద కీ యం

పట్టణాల విస్తరణ.. ప్రకృతికి ఎంత మూల్యం?

పట్టణాలు అభివృద్ధికి ప్రతీకలు. కొత్త రహదారులు, భవనాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, మెట్రో రైళ్లు.. ఇవన్నీ ఆర్థిక పురోగతికి సంకేతాలే. కానీ పట్టణ విస్తరణకు అనుగుణంగా ప్రకృతి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వకపోతే అభివృద్ధి పేరుతో భవిష్యత్తుకు సమస్యలను సృష్టించే ప్రమాదం ఉంది. నగరాలు విస్తరిస్తున్న కొద్దీ చెరువులు కనుమరుగవడం, పచ్చదనం తగ్గిపోవడం, భూగర్భ జలాలు పడిపోవడం, వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిణామాలు ఇప్పుడు అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి.అభివృద్ధి ఆగిపోవాల్సిన అవసరం లేదు. కానీ అది ప్రకృతిని ధ్వంసం చేస్తూ సాగకూడదు. రహదారి అవసరమే.. ఇల్లు అవసరమే.. పరిశ్రమ అవసరమే. అదే సమయంలో నీటి వనరులు, పచ్చని ప్రదేశాలు, సహజ డ్రైనేజీ వ్యవస్థ కూడా అంతే అవసరం. ఈ సమతుల్యతను కాపాడటమే ఆధునిక పట్టణ ప్రణాళికకు అసలు పరీక్ష.

చెరువులు మాయం అయితే భవిష్యత్తు ప్రశ్నార్థకం

ఒకప్పుడు పట్టణాలకు నీటి భద్రత కల్పించిన చెరువులు, కుంటలు ఇప్పుడు ఆక్రమణలు, నిర్మాణాలతో క్రమంగా తమ ఉనికిని కోల్పోతున్నాయి. చెరువుల సహజ ప్రవాహ మార్గాలు మూసుకుపోతే వర్షపు నీరు సరైన దిశలో వెళ్లదు. భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పెరుగుతుంది.అందువల్ల ప్రతి పట్టణంలో ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు, వాగుల సహజ మార్గాలను రక్షించాలి. నీటి వనరులను కేవలం ప్రభుత్వ ఆస్తులుగా కాకుండా సామాజిక సంపదగా చూడాలి. వాటి చుట్టూ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంతో పాటు ఇప్పటికే ఉన్న సమస్యలను చట్టబద్ధమైన ప్రక్రియలో పరిష్కరించాలి.

కాంక్రీట్ నగరాలకు విరామం అవసరం

పట్టణాల్లో ఖాళీ స్థలం కనిపిస్తే నిర్మాణమే పరిష్కారమనే ధోరణి పెరుగుతోంది. ఫలితంగా చెట్లు, పార్కులు, ఓపెన్ స్పేస్‌లు తగ్గిపోతున్నాయి. కాంక్రీట్ విస్తీర్ణం పెరిగేకొద్దీ వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం తగ్గుతుంది. వేసవిలో వేడి మరింత తీవ్రంగా అనిపించే పరిస్థితి ఏర్పడుతుంది.కొత్త నిర్మాణాల్లో పచ్చదనం, వర్షపు నీటి సంరక్షణ, నీటి రీచార్జ్, పబ్లిక్ ఓపెన్ స్పేస్‌లకు నిర్దిష్ట ప్రాధాన్యం ఇవ్వాలి. ఉన్న చెట్లను తొలగించడం చివరి మార్గంగా మాత్రమే ఉండాలి. ఒక చెట్టు నరికిన తర్వాత మరికొన్ని మొక్కలు నాటడం సరిపోదు; పెరిగిన చెట్టు ఇచ్చే పర్యావరణ ప్రయోజనాలను కూడా గుర్తించాలి.

నీటి పొదుపు.. ప్రతి ఇంటి బాధ్యత

పట్టణీకరణ పెరిగే కొద్దీ నీటి అవసరాలు కూడా పెరుగుతున్నాయి. కానీ నీటి వనరులు అపరిమితంగా లేవు. వేసవికాలంలో నీటి కొరత కనిపించినప్పుడు మాత్రమే నీటి విలువ గుర్తుచేసుకోవడం సరిపోదు. రోజువారీ వినియోగంలోనే పొదుపు అలవాటుగా మారాలి.ఇళ్లలో వర్షపు నీటి సంరక్షణ, లీకేజీల నివారణ, అవసరానికి మించి నీరు వృథా చేయకపోవడం వంటి చర్యలు ప్రతి కుటుంబం చేపట్టాలి. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు కూడా నీటి వినియోగాన్ని తగ్గించే సాంకేతిక విధానాలను అనుసరించాలి.

చెత్త నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

పట్టణ విస్తరణతో మరో ప్రధాన సమస్య ఘన వ్యర్థాల నిర్వహణ. జనాభా పెరుగుతున్న కొద్దీ రోజువారీ చెత్త పరిమాణం కూడా పెరుగుతోంది. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం, కాలువల్లో పారేయడం, బహిరంగంగా కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది.ఇంటివద్దే తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పునర్వినియోగం చేసే వస్తువులను ప్రోత్సహించడం వంటి అలవాట్లు తప్పనిసరి కావాలి. స్థానిక సంస్థలు కూడా చెత్త సేకరణ, రవాణా, శుద్ధి ప్రక్రియల్లో పర్యవేక్షణను పెంచాలి.

ప్రణాళిక లేని నిర్మాణాలకు అడ్డుకట్ట

పట్టణ ప్రణాళికలో అత్యంత కీలకం దీర్ఘకాల దృష్టి. ఈరోజు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన భవనాలు, రహదారులు రేపటి జనాభా పెరుగుదలను తట్టుకోగలవా? రవాణా రద్దీ ఎలా ఉంటుంది? నీటి అవసరం ఎంత? డ్రైనేజీ వ్యవస్థకు తగిన సామర్థ్యం ఉందా? వంటి ప్రశ్నలకు ముందుగానే సమాధానాలు వెతకాలి.ఒక ప్రాంతంలో అనుమతులు ఇవ్వడం మాత్రమే అభివృద్ధి కాదు. సమగ్ర మాస్టర్‌ప్లాన్, ట్రాఫిక్ ప్రణాళిక, పర్యావరణ ప్రభావం, నీటి నిర్వహణ, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలను కలిపి చూడాలి.

ప్రజల భాగస్వామ్యమే కీలకం

పట్టణ అభివృద్ధి నిర్ణయాల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉండాలి. ఒక ప్రాంతంలో ఏ సమస్య ఉంది, ఎక్కడ నీరు నిలుస్తోంది, ఏ చెరువు ప్రమాదంలో ఉంది, ఏ రహదారి అత్యంత రద్దీగా ఉంది వంటి విషయాలను స్థానికులు బాగా తెలుసుకుంటారు. వారి సూచనలు ప్రణాళికలో భాగమైతే అభివృద్ధి మరింత వాస్తవికంగా ఉంటుంది.పౌర సమాజం, నిపుణులు, స్థానిక సంస్థలు కలిసి పనిచేసినప్పుడే పట్టణాలు నివసించడానికి అనువైనవిగా మారతాయి. ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచడం, అక్రమ నిర్మాణాలను నిర్లక్ష్యం చేయకపోవడం, ప్రకృతి వనరుల పరిరక్షణలో భాగస్వాములు కావాలి.

అభివృద్ధి అంటే కేవలం కాంక్రీట్ కాదు

పట్టణం ఎత్తైన భవనాలతో నిండిపోవడం అభివృద్ధికి ఒక రూపం మాత్రమే. అక్కడ స్వచ్ఛమైన గాలి, తగిన నీరు, పచ్చని ప్రదేశాలు, సురక్షిత రహదారులు, సమర్థవంతమైన పారిశుద్ధ్య వ్యవస్థ, ప్రజలకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులు ఉండాలి. అప్పుడు మాత్రమే ఆ అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది.అభివృద్ధి అవసరం.. కానీ ప్రకృతి మూల్యం చెల్లించి సాధించే అభివృద్ధి శాశ్వతం కాదు. నేటి తరానికి సౌకర్యాలు కల్పిస్తూనే రేపటి తరానికి నీరు, గాలి, పచ్చదనం మిగిలేలా ప్రణాళిక చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనా, ప్రజలపైనా ఉంది. ప్రకృతిని కాపాడే పట్టణమే నిజమైన అభివృద్ధి చెందిన పట్టణం.

కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ... మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

మొదటి పేజీ తరువాయి)

2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు.తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

మోదీ-ట్రంప్ ఫోన్ కాల్.. వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుత సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా-యూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది. గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్-అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం.. దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు

మొదటి పేజీ తరువాయి)

పేరుతో నిరసన మార్చ్‌లు నిర్వహిస్తాం. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలందరం కలిసి ఈసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తాం," అని తెలిపారు.దేశవ్యాప్తంగా ఐదు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించామని, అందులో మొదటి సభ నవంబర్ 1న ఢిల్లీలో జరుగుతుందని ఖర్గే వివరించారు. ఈ అంశంపై రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. బీజేపీ, మోదీ, అమిత్ షా ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేస్తున్నారని, దాన్ని నాశనం చేసిన వారికి శిక్ష పడేలా చూస్తామని హెచ్చరించారు.కాగా, ఈ సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ దూరంగా ఉంది. తాము 'ఇండియా' కూటమిలో భాగం కాదని ఆ పార్టీ స్పష్టం చేసింది. మరోవైపు, ఈ భేటీపై బీజేపీ విమర్శలు గుప్పించింది. రాహుల్ నాయకత్వాన్ని అంగీకరించేందుకు కూటమి సిద్ధంగా లేదనడానికి అఖిలేశ్ యాదవ్ గైర్హాజరు కావడమే నిదర్శనమని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు.

యూపీ పోలీసు విభాగాన్ని రద్దు చేసి.. అన్ని కేసులు సీబీఐకి అప్పగిస్తాం: సుప్రీంకోర్టు ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అవసరమైతే యూపీ పోలీసు విభాగాన్నే రద్దు చేసి, రాష్ట్రంలోని అన్ని కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేసింది. ఒక క్రిమినల్ కేసులో పోలీసులు అనుసరిస్తున్న పక్షపాత వైఖరిని గమనించిన న్యాయస్థానం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది.జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాలతో కూడిన ధర్మాసనం ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. తనపై దాడికి యత్నించిన ఒక మోటార్ సైకిలిస్టును పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే, వారు మాత్రం గుర్తుతెలియని వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారంపై యూపీ పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌పై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. "నిందితుడిని ఘటనా స్థలంలోనే పట్టుకున్నప్పుడు, గుర్తుతెలియని వ్యక్తిపై ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు? ఇలా చేస్తే ప్రజలకు పోలీసులపై నమ్మకం ఎలా ఉంటుంది?" అని ధర్మాసనం ప్రశ్నించింది. "మీ ప్రతి పనిలో ఒక అజెండా కనిపిస్తోంది. ఈ అసంబద్ధతకు ఎక్కడో ఒకచోట అడ్డుకట్ట పడాలి. యూపీ పోలీసులను రద్దు చేసి, అన్ని కేసులను సీబీఐకి అప్పగించడమే మేలు" అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఈ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరుపై సరైన వివరణతో మరో అఫిడవిట్ దాఖలు చేయాలని, తదుపరి విచారణకు సంబంధిత పోలీస్ అధికారి వ్యక్తిగతంగా హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు.. సీఎం రేవంత్ రెడ్డి అభినందన

ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చర్ చికితకు రెండు స్వర్ణాలు

చికితను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంస

ఈ విజయంతో 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చికిత

పెద్దపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారిణి చికిత

ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు.ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ధ్యేయం





ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు
ప్రతి మూడు నెలలకు వైద్య పరీక్షలు : మున్సిపల్ కమిషనర్ టి వెంకన్న

వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 30:

నగర పారిశుద్ధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు.వైద్య శిబిరంలో కార్మికులకు కంటి పరీక్షలు, రక్త పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్మికుల ఆరోగ్యం, విధి నిర్వహణలో భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య కార్డులు, వ్యక్తిగత రక్షణ సామగ్రి, గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ చెత్త సేకరణ, రవాణా, నగర పరిశుభ్రత వంటి పనుల్లో నేరుగా పాల్గొంటున్న నేపథ్యంలో వారి ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సకాలంలో ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్య పరిరక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. కార్మికుల సంక్షేమానికి అవసరమైన ఇతర చర్యలను కూడా కొనసాగిస్తామని తెలిపారు.తడి, పొడి చెత్తను సేకరించడంలో చురుగ్గా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు స్వచ్ఛ ఆటో డ్రైవర్లను కమిషనర్ వెంకన్న అభినందించారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా మరింత మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, జవాన్లు,పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో 'ఏక్ పెడ్ మా కే నామ్'.. పచ్చదనంపై ప్రతిజ్ఞ





నల్గొండ, సెప్టెంబర్ 30 (విజయ కెరటం):

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎఫ్‌సీఐ నల్గొండ డీఎం సువీన్ కుమార్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా (ఎస్‌హెచ్‌ఎస్)-2026లో భాగంగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నల్గొండ డివిజనల్ కార్యాలయంలో బుధవారం 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సువీన్ కుమార్ మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెంచి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. ఎఫ్‌సీఐ ఏజీఎం (ఇజ) డా. రాఘవేంద్ర సింగ్ మాట్లాడుతూ స్వచ్ఛతతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీనియర్ అధికారులు విద్యాసాగర్, కె. కృష్ణమూర్తి, ప్రకాశ, రత్న స్వప్న, రవి కుమార్, ఏడుకొండలు, రాము, టెక్నికల్ ఉద్యోగుల సంఘం రీజినల్ సెక్రటరీ ఫరీద్, బాబీ నాయక్, సతీష్ రెడ్డి, రమేష్, క్రాంతి, హిమబిందు, రమ్య, నీరజ, కీర్తన తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ కార్యాలయ పరిసరాలను పచ్చదనంతో, పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు.

వైద్యులు డాక్టర్ గజవెల్లి రాజు వరంగల్ రెడ్ క్రాస్ పాలక మండలి సభ్యుడుగా ఎన్నిక

వరంగల్ విజయకెరటం ప్రతినిధి...సెప్టెంబర్ 30



వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ పాలక మండలి సభ్యులుగా ఎన్నికైన డాక్టర్ జి. రాజ్ కుమార్ వరంగల్ ఓజూ హాల్ లో జరిగిన సమావేశంలో ఓజూ సీఈఓ వసంత గారు సమావేశానికి అధ్యక్షత వహించారు. చైర్మన్ గా బేతి అశోక్ బాబు వైస్ చైర్మన్ గా శానబోయిన రాజకుమార్ గారు, ట్రెజరరు బొల్లం శివగారు, మరియు 12మంది సభ్యులుగా మొత్తం 15 మంది తో కూడిన పాలకవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రస్తుత పాలకవర్గం తెలిపింది.సామాజిక స్పృహకలిగిన, పేదల. డాక్టర్ గా పేరొందిన రాజు గారు ఎన్నిక కావటం పట్ల వారి మిత్ర బృందం మరియు వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.సభ్యుడిగా ఎన్నిక కావటం పట్ల చైర్మన్ గారికి మరియు తన తో పాటు ఎన్నికైన ప్రతీ సభ్యులకు, తనపైన నమ్మకముంచి బాధ్యతలు అందించిన పాలక మండలికి, డాక్టర్ రాజు గారుధన్యవాదాలు తెలిపారు.

నల్గొండ జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు.. ఘన స్వాగతం

నల్గొండ: సెప్టెంబర్ 30 విజయ కెరటం



(పెద్దగోని మధు గౌడ్) పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు నల్గొండ జిల్లాకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలకూరి రవిగౌడ్ ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు.అనంతరం రామచంద్రరావు ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వర్షాభావం, విద్యుత్ సమస్యలతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రైతుల గోనె సంచుల చార్జీలు పెంచాలి
మిర్చి తూకాల్లో కోతలతో నష్టం
కలెక్టర్‌కు తెలంగాణ రైతు సంఘం వినతి

వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 30:



వరంగల్ నగరం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మిర్చి పంటలను విక్రయించే రైతుల గోనె సంచుల చార్జీలను పెంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2017లో గోనె సంచి ఒక్కింటికి రూ. 30గా నిర్ణయించిన చార్జీని ఇప్పటివరకు పెంచలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను సవరించకపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. సంచి ఒక్కింటికి రూ. 80 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మిర్చి బస్తాల తూకాల్లోనూ రైతులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ 12న జరిగిన సమావేశంలో మిర్చి బస్తా బరువు 49 కిలోలకు మించకూడదని నిర్ణయించిన అనంతరం, అంతకుమించిన బస్తాలపై 500 గ్రాముల చొప్పున కోత విధిస్తున్నారని తెలిపారు. దీనివల్ల 2023 నుంచి 2025 వరకు రైతులు సుమారు రూ. 15 కోట్ల మేర నష్టపోయారని పేర్కొన్నారు.తూకాల్లో కోత విధించిన మిర్చి పరిమాణాన్ని గత మూడేళ్ల దాడువాయి, తక్ పట్టీల ఆధారంగా లెక్కించి, అందుకు సంబంధించిన మొత్తాన్ని వ్యాపారుల నుంచి వసూలు చేసి మార్కెట్ కమిటీకి జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు జరుగుతున్న నష్టాన్ని అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.రెడ్డి హంసారెడ్డి, జిల్లా నాయకుడు గోనె కుమారస్వామి పాల్గొన్నారు.

సురేందర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం



నల్గొండ: సెప్టెంబర్ 30 విజయ కెరటం ప్రతినిధి

పంచాయతీరాజ్ ఉద్యోగిగా గడుసు సురేందర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. జిల్లా ప్రజాపరిషత్‌లో పర్యవేక్షకులుగా విధులు నిర్వహించిన గడుసు సురేందర్ రెడ్డి బుధవారం పదవీ విరమణ పొందిన సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రేమ్ కరణ్ రెడ్డి, సురేందర్ రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురేందర్ రెడ్డి సుదీర్ఘకాలం పంచాయతీరాజ్ శాఖలో అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగుల్లో మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. సమయపాలనతో పాటు తోటి ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని తెలిపారు.సురేందర్ రెడ్డి పదవీ విరమణతో నల్గొండ జిల్లా ప్రజాపరిషత్ ఒక అనుభవజ్ఞుడైన, బాధ్యతాయుతమైన ఉద్యోగిని కోల్పోతుందని అన్నారు. ఆయన సేవలు, అనుభవం, సేవాభావం సహోద్యోగులకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సామాజిక జీవితానికి కొత్త ప్రారంభమని చెబుతూ.. ఇకపై కుటుంబ





సభ్యులతో ఆనందంగా, ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు.అనంతరం అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, సిబ్బంది సురేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. పలువురు ఉద్యోగులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని, ఉద్యోగ జీవితంలో అందించిన సహకారాన్ని గుర్తుచేసుకున్నారు.సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తన ఉద్యోగ జీవితంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో పనిచేసిన కాలం తన జీవితంలో మరచిపోలేని అనుభవాలను అందించిందని, పదవీ విరమణ సందర్భంగా అందించిన ఆత్మీయత, గౌరవం ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు.కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మోహన్, యూటీఎఫ్ నాయకుడు ఎడ్ల సైదులు, పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమేష్, జిల్లా పరిషత్ పర్యవేక్షకుడు బసవోజు శ్రీనివాసచారి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు, జిల్లా పరిషత్ సిబ్బంది, సహోద్యోగులు తదితరులు పాల్గొని సురేందర్ రెడ్డికి ఘన వీడ్కోలు పలికారు.



విజయకేరటం
తెలుగు దినపత్రిక

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై రాధిక ఫైర్

రివ్యూల పేరుతో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని విమర్శ

మంచి సినిమాలకు కూడా నెగటివ్ ప్రచారం బాధ కలిగిస్తోందని ఆవేదన

వారిపై కఠిన చర్యలు తీసుకునే వ్యవస్థ ఉండాలని డిమాండ్



సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్ల తీరుపై సీనియర్ నటి, నిర్మాత రాధికా శరత్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రివ్యూల పేరుతో కొందరు చేస్తున్న వ్యాఖ్యలు హద్దులు మీరుతున్నాయని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా రాధిక ఈ వ్యాఖ్యలు చేశారు.డిజిటల్ మీడియా విస్తృతి పెరిగాక సినిమాల, నటీనటులతో పాటు వారి కుటుంబ సభ్యులపై కూడా ఇష్టానుసారంగా విమర్శలు చేయడం పరిపాటిగా మారిందని రాధిక మండిపడ్డారు. తమను ఎవరూ ప్రశ్నించరనే ధీమాతో కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం సినిమా రివ్యూల వ్యవహారం అదుపు తప్పుతోందని, ఇది ప్రపంచవ్యాప్త సమస్య అయినప్పటికీ, మన దగ్గర మరీ తీవ్రంగా ఉందని అభిప్రాయపడ్డారు.సినిమా బాగున్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా ప్రతికూల ప్రచారం చేయడం పట్ల రాధిక ఆవేదన వ్యక్తం చేశారు. అదుపుతప్పుతున్న ఇలాంటి కంటెంట్ క్రియేటర్లను నియంత్రించేందుకు ఒక బలమైన వ్యవస్థ ఉండాలని, హద్దులు దాటి ప్రవర్తించే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.


షూటింగ్ స్పాట్‌కు ఆటోలో వచ్చిన రజనీకాంత్

మైసూరులో 'ధర్మన్' సినిమా సెట్‌లో ఘటన

అభిమానులకు అభివాదం.. సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

సూపర్ స్టార్ సింప్లిసిటీపై వెల్లువెత్తుతున్న ప్రశంసలు

సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన నిరాడంబరతను చాటుకుని అందరినీ ఆశ్చర్యపరిచాడు. ప్రస్తుతం తాను నటిస్తున్న 'ధర్మన్' చిత్ర షూటింగ్ నిమిత్తం మైసూర్‌లో ఉన్న ఆయన, సెట్‌కు ఏకంగా ఆటో రిక్షాలో చేరుకున్నాడు. ఈ అనూహ్య దృశ్యాన్ని చూసి అక్కడున్న అభిమానులు, చిత్ర బృందం ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.మైసూర్‌లో జరుగుతున్న 'ధర్మన్' సినిమా షూటింగ్ లొకేషన్‌కు రజనీకాంత్ ఆటోలో రావడం విశేషం. మెరూన్ రంగు చొక్కా, పంచె కట్టుకుని ఆటో దిగిన ఆయన, తన కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు వినమ్రంగా చేతులు జోడించి నమస్కరించాడు. అందరికీ అభివాదం చేస్తూ సెట్‌లోకి వెళ్లాడు. గేటు మూసివేస్తున్న సమయంలోనూ, బయట 'తలైవా' అంటూ నినాదాలు చేస్తున్న అభిమానుల కోసం ఆయన మరోసారి బయటకు వచ్చి వారిని పలకరించడం అందరినీ ఆకట్టుకుంది.అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో 'ధర్మన్' చిత్రం రూపొందుతోంది. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇందులో రజనీకాంత్ వైద్యుడి పాత్రలో నటిస్తుండగా, సిమ్రాన్, రాశీ ఖన్నా, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే మైసూరులో ఈ సినిమా మూడో షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. ఈ ఘటనతో సూపర్ స్టార్ సింప్లిసిటీపై నెటిజన్లు ప్రశంసలు వర్షం కురిపిస్తున్నారు.



థియేటర్లలో ఛఠ్ పూజ.. ప్రసాదాలు పంచుకుంటున్న తమన్నా అభిమానులు!

'ది వాక్' సినిమా ప్రదర్శనలో ఛఠ్ పూజ సందడి

థియేటర్లలోనే ప్రసాదాలు పంచుకుంటున్న ప్రేక్షకులు

సినిమాలోని 'ఛఠీ మైయా' పాటకు జనం జేజేలు

సంప్రదాయ వస్త్రాలతో సినిమాకు వస్తున్న బీహారీ మహిళలు

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు

బాలీవుడ్ నటులు సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో నటించిన 'ది వాక్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' చిత్రం ప్రదర్శితమవుతున్న థియేటర్లలో ప్రస్తుతం ఒక అరుదైన, ఆసక్తికరమైన దృశ్యం ఆవిష్కృతమవుతోంది. ముఖ్యంగా బీహార్, దాని పరిసర ప్రాంతాల్లోని ప్రేక్షకులు సినిమా హాళ్లను ఛఠ్ పూజ వేడుకలకు వేదికలుగా మార్చేస్తున్నారు.ఈ చిత్రంలో బీహార్ ప్రజల అతిపెద్ద పండుగైన ఛఠ్ పూజ నేపథ్యంలో కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కించారు. అంతేకాకుండా, 'బీహార్ కోకిల'గా ప్రసిద్ధి చెందిన దివంగత గాయని శారదా సిన్హా ఆలపించిన సుప్రసిద్ధ 'ఛఠీ మైయా' భక్తిగీతాన్ని ఈ సినిమాలో చేర్చారు. థియేటర్లలో ఈ పాట వస్తున్న సమయంలో ప్రేక్షకులు, ముఖ్యంగా మహిళలు భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. ప్రేక్షకులు తమ ఇళ్ల నుంచి 'కేకువా' అనే సంప్రదాయ పిండివంటను ప్రసాదంగా తీసుకువచ్చి, ఆ పాట ప్రసారమవుతున్న సమయంలో తోటి ప్రేక్షకులకు పంపిణీ చేస్తున్నారు. కొన్ని థియేటర్లలో ప్రేక్షకులు ఛఠ్ పూజ సమయంలో ధరించే సంప్రదాయ వస్త్రాలతో సినిమాకు హాజరవుతుండటం విశేషం. సినిమా ప్రదర్శనను ఒక పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తూ వారు తమ భక్తిని చాటుకుంటున్నారు. వీటికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528